
# ఎర్రగురువింద

## గిరిజా నారాయణ్




శంకర్రావు భార్య శాంత తన ఇల్లు, పిల్లలు, భర్త తప్ప మరే విషయం బుర్రకెక్కించుకోదు. ప్రొద్దున్నే లేచి క్యారేజి తయారుచేసి భర్తను ఆఫీసుకు పంపించినది మొదలు పిల్లల్ని స్కూలుకు పంపటం, యింటి పనులు చేసుకోవటం మిగిలిన సమయంలో తాను ఓపెన్ యూనివర్సిటీకి ప్రయివేటుగా కట్టిన బి.ఏ. పుస్తకాలు చదువుకోవటం, అప్పుడప్పుడు వార పత్రికలులాంటివి తిరగేయడంతో ఆవిడ దిన చర్య గడిచిపోతుంది.

యిరుగు పొరుగు అమ్మలక్కలతో కబుర్లు చెప్పటం, మహిళా సమాజం పేరిట దేశంమీద పడి భర్తని, పిల్లల్ని వాళ్ళ కర్మకు వాళ్ళను వదిలివేయటం శాంతకు ససేమిరా యిష్టం ఉండదు. సరిగ్గా ఈ విషయంలోనే శాంతకు ఎదురింటి కాంతంకు చుక్కెదురయింది.

ఎదురింటి కాంతం ఎన్నిసార్లు డింకీలు కొట్టిందో కానీమొత్తానికి బియస్సీ ప్యాసయ్యాననిపించింది పెళ్ళికి ముందే. మహిళా సమాజం వాళ్ళంతా ఆవిడ డిగ్రీని మెచ్చుకుంటూ ఆవిడ చేత చిన్నపాటి నర్సరీ స్కూలు ప్రారంభింపచేశారు వాళ్ళుండే కాలనీలో. దానితోఆవిడ తానే ప్రిన్సిపాల్ కమ్ టీచర్‌గా ఆ స్కూలుకు ఒకే ఒక పెద్ద దిక్కయినట్లు కళ్ళు నెత్తిమీద పెట్టుకొని మాట్లాడ్తుంటుంది. ఆవిడను ఆకాశంకెగేసి అందుకు ఆవిడ పొందే ఆనందంలో తమవంతు పాలు యధాశక్తిగా పంచుకొంటూ కాలం గడిపేసే స్నేహితురాళ్ళు మరో ముగ్గురున్నారు—లక్ష్మి, సరోజ, అరుణ ఎవ్వరూ వాళ్ళ పేర్లున్నంత నాజూగ్గా ఉండరన్నది వేరే విషయం.

వాళ్ళు నల్గురూ ఓచోటికి చేరితే మహాభారతంలో దుష్ట చతుష్టయం గుర్తుకు రాక మానదు. అమెరికా అణ్వస్త్ర పరీక్షలపై చర్చ ప్రారంభించి, చిన్నగా పంజాబ్ ఆందోళన, గుజరాత్‌లో హింసాకాండ, ఆంధ్రాలో యిటీవల జరిగిన బి.సి. రిజర్వేషనుల వంటి అంతర్జాతీయ, జాతీయ సమస్యలతో సహా ఆ వీధిలో కామాక్షమ్మ మొగుడ్ని ఆఫీసుకు పంపించి స్కూటరుపై ఎవడితో పోతుంది, ఎవరైనా భర్తకు తెలీకుండా బియ్యం అమ్ముకుని ఉదయం ఆట సినిమాకు వెళ్తుంటుంది, ఎవరు ఆరోజు పట్టుచీర కట్టి పూలజడ వేసుకొన్నారో కూడా వాళ్ళ చర్చల్లో అంశాలే.

యిలాంటి ముచ్చట్లను మొదట్లో విని, అలాంటి వాళ్ళతో కాలక్షేపం చేయటం అంత వృధా ప్రయాస మరోటిలేదని నిశ్చయించుకొని యింటివరకే తన కార్యక్రమాన్ని పరిమితం చేసుకొంది శాంత. ఆమె అలా ఒక్కత్తే యింట్లో మ్రగ్గిపోవటానికి కారణం శాంతకు ఆమె భర్త స్వేచ్ఛనివ్వక పోవటమేనని కాంతం, ఆమె స్నేహితురాళ్ళు చాలాసార్లు నిర్ధారించారు. ఎలాగైనా శాంతలో చైతన్యం తెచ్చి, ఆవిడకు స్వేచ్ఛని కల్పించి తమలో ఓ మనిషిగా జాతిజీవన ప్రవంతిలోకి తీసుకు రావాలని వాళ్ళు నడుం బిగించారు.




అనుకున్నదే తడవుగా ఆరోజు సాయంత్రం నాల్గింటికి ముహూర్తం నిర్ణయించి సరోజను శాంత యింటికి



పంపారు మిగతా ముగ్గురూ. తనకు భారతంలో కృష్ణుడి పోర్షను, రామాయణంలో అంగదుడి హోదా లభించి నందుకు లోలోనే మురిసిపోతూ రాయబారానికి బయ ల్దేరింది సరోజ.

శాంతకు కాంతం ప్రజ్ఞాపాటవాలను గురించి, కాంతం ద్వారా తమ తన స్నేహితులు నేర్చుకున్న ప్రపంచ పరిజ్ఞానం గురించి వివరించి చెప్పాలని ఎంత గానో ప్రయత్నించింది సరోజ. కాంతం నుంచి శాంత నేర్చుకోవాల్సిన అనేక లౌకిక, రాజకీయ నీతుల గురించి నచ్చచెప్పి చూపింది. కానీ శాంత సరోజ ప్రయత్నాలేవీ పడనీయ లేదు. పైగా ఆ విధంగా కాలం వృధా చేయ టం తనకిష్టంలేదని, అవకాశమొస్తే తనే ఎప్పుడన్నా వ చ్చి వాళ్ళతో కాలక్షేపం చేయగలనని ఎదురు నచ్చచెప్పి సరోజను వచ్చిన దారినే త్రిప్పి పంపింది.

సరోజతో గంటసేపు జిగిబిగిగా వాదించేప్పటికి శాంతకు ప్రాణం కడబట్టినట్లయింది. ఓసారి గడియా రంవైపు చూసింది. సరిగ్గా ఐదయింది సమయం. పిల్లలు కూడా వచ్చే వేళయిందనుకొంది మనస్సులోనే. సరిగ్గా అప్పుడు గుర్తు వచ్చింది శాంతకు తన భర్త రాత్రి ప్రొద్దుపోయినాక వస్తానని చెప్పిన సంగతి. సరోజ కాంతం ఆంతర్యం ఓసారి మనస్సులోనే విశ్లేషించు కొని, చిరునవ్వు నవ్వుకొని యింకే మాత్రం ఆలస్యం చేయకుండా గబగబా యింటి పనుల్లోకి చొరబడింది శాంత.


యింటి పనుల్లోంచి తెమిలి పిల్లల్ని చదివించి వాళ్ళ కు ప్రక్కలువేసి పడుకోబెట్టి, తమ టేబిల్ లైటు వేసుకుని, కమర్షియల్ జాగ్రఫీ చదువుతూనే పడక్కు ర్చీలో వెనక్కి వాలింది. ఎప్పుడు కళ్ళు మూతలు పడ్డాయో శాంతకు తెలీనే తెలీదు.

రాత్రి బాగా ప్రొద్దుపోయినాక, సిటీకెళ్ళిన శంక ర్రావు తిరిగొచ్చి "శాంతా శాంతా" అని తలుపుకొట్టి బిగ్గరగా పిల్చాడు. రెండుమూడు సార్లు కాలింగ్‌బెల్ నొక్కి చూశాడు. చుట్టుపక్కల వాళ్ళంతా ఆసరికే నిద్రలో మునిగిపోయారు.

ఓసారి టైము చూసుకున్నాడు శంకర్రావు. రాత్రి పావు తక్కువ పది కావస్తున్నది. ఆ కాలనీలో అందరూ రాత్రి తొమ్మిది గంటలకే తలుపులేసుకొని శయ్యా మందిరం ఆశ్రయిస్తుంటారు. అందువలన అంతా నిశ్శబ్దంగా ఉంది. శంకర్రావుకు ఏం చేయాలో పాలు పోలేదు. "సాధారణంగా తను ఆలస్యంగా వస్తానని చెప్పి న రోజు శాంత తనకోసం బయటనే కూర్చుని దీపం వేసుకొని ఏదో చదువుకొంటూంటుంది. ఈరోజు యిలా నిద్రపోతున్నదేమిటి చెప్మా? బహుశా బడలికవల్ల కన్ను మూయగానే నిద్ర పట్టినట్లుంది శాంతకు. ఈ మధ్య పనిమనిషి కూడా రాకపోవటంతో మొత్తం పనంతా తానే చేసుకోవటంవల్ల బాగా బడలిక చేసుం టుంది. అందువల్లనే అంత త్వరగా నిద్రపట్టుంటుం ది. తనకు" మనస్సులోనే అనుకొన్నాడు శంకర్రావు తలుపు సందుల్లోంచి బెడ్‌రూమ్‌లో వెల్గుతున్న టేబిల్ లైటు చూసి.

శంకర్రావు శాంతని పిలవటం, ఆవిడ తలుపు తీయ క పోవటం అక్కడే ఆలోచిస్తూ తచ్చట్లాడుతున్న శంకర్రా వును కాంతం, ఆమె స్నేహితులు గమనించకపోలేదు. మధ్యాహ్నం తాము పంపిన రాయబారం విఫలం కావ టంతో కాంతం, లక్ష్మి, సరోజ, అరుణలకు ఎంతో అవ మానంగాను, పుండుపై కారం చల్లినట్లుంది. "పాపం భర్త యినుప పాదాలక్రింద స్వేచ్ఛ లేకుండా నలిగిపోతున్న శాంతను మార్చాలన్న తమ సదుద్దేశానికి శాంతే ఎదురు తిరగటం వాళ్ళకు భరించలేని రోషాన్ని, ఆవేదన్ని కల్గించింది. అందుకే కాలనీ అంతా నిద్ర లోమునిగున్నా వాళ్ళకు మాత్రం నిద్ర పట్టలేదు. ప్రతీ కారం ఎలా తీర్చుకోవాలన్నదే వాళ్ళందరి ఏకైక లక్ష్యం.

సరిగ్గా అదే సమయంలో శంకర్రావు తన భార్యని నిద్రలేపటానికి విఫల ప్రయత్నం చేయటం చూసిన వాళ్ళందరికీ హఠాత్తుగా ఓ దివ్యమైన ఆలోచనవచ్చింది.



శంకర్రావుమ శాంతపైకి ఎలాగైనా ఉసిగొల్పి రెచ్చగొట్టితే శాంతకు తగిన శాస్తి చేసినట్లవుతుందని వాళ్ళ ఆలోచన. ఆ విధంగానైనా వాళ్ళకు జరిగిన అవమానానికి తమ పెద్దరికాన్ని ధిక్కరించినందుకూ లేశ మాత్రంగానైనా ఆవిడకు శాస్తి చేసినట్లవుతుందన్నది వారి ఆంతర్యం.

అనుకున్నదే తడవుగా కాంతం యింటి అరుగు పైన కూర్చున్న నల్గురూ ఒకరికొకరు కనుసైగలు చేసుకున్నారు.

"ఏమిటో మొగుడు బయటికెళ్తే తిరిగి యింటి కొస్తాడన్న ధ్యాసకూడా ఉండదు ఈరోజుల్లో ఆడవాళ్ళకి" మొదలుపెట్టింది కాంతం సరోజను గిల్లుతూ సంభాషణ రక్తి కట్టించమని.

అవునవును. "పైకి అది చదువుతున్నాం. యిది చదువుతున్నాం" అని గొప్పలు చెప్పకోవటం మాత్రం బాగా తెల్సు. చదువుతున్న కొద్దీ భర్త పట్ల ఉండాల్సిన గౌరవం పెరగటంలేదు తరుగుతోంది ఈ రోజుల్లో. భర్తల్ని ఎలా చూసుకోవాలో తెలీనప్పుడు డిగ్రీలు మాత్రం ఎందుకంటా. నాలిగ్గీచుకోడానికి తప్ప" అంది సరోజ లక్ష్మివైపు చూస్తూ శాంతపై తన కసినంతా వెళ్ళగక్కుతూ.

వెంటనే లక్ష్మి అందుకొంది "యిదే మా ఆయనయితేనా. నాడొక్క చించి డోలుకట్టే వాడు. అయినా ఈ రోజుల్లో మగాళ్ళు మునుపటి వాళ్ళ మాదిరికాదులే. నా అదృష్టం మా ఆయన ఈ కాలం తరహా మనిషి కాదు. పులి, సింహం కలబోసి మా ఆయన అయ్యాడు. ఆయనకు కోపం వస్తుందంటేనే మా అందరికీ హడల్. మరి మనమూ చూస్తున్నాం—త్యాగయ్య చెప్పినట్లు— "ఎంత వారలయినా కాంత దాసులే కదా" అని. ఈ కాలం మగాళ్ళంతా ఆడవాళ్ళకు దాసోహమంటున్న రోజులివి. ఛీ.ఛీ. పెళ్ళాన్ని అదుపాజ్ఞల్లో పెట్టుకోలేని మగాళ్ళు కూడా మగాళ్ళేనంట. శుభ్రంగా చీరె, గాజులు తొడుక్కొని ఆవిడ్ని పేంటు, చొక్కా వేసుకోమంటే పోలా. ఏమయినా యిదో చోద్యం లేమ్మా" అంటూ శంకర్రావును రెచ్చగొట్టటానికి ప్రయత్నించింది లక్ష్మి.

"కరెక్టుగా చెప్పావు లక్ష్మి. యిదేమి చోద్యమోగాని భర్త లేకుండా అలా ఒంటరిగా బిక్కుబిక్కు మంటూ నిద్రపోవటం నావల్ల అసలు కాదనుకో. అయినా మగాడంటే కాస్త గట్టిగా ఉండాలికాని యిలా పెళ్ళాన్ని కోప్పడితే ఆవిడగారు కందిపోతుందని భయపడే మగాళ్ళని యిప్పుడే చూస్తున్నాం" తనవంతు పాఠం గడగడా ఒప్పచెప్పింది అరుణ.

వీళ్ళ సంభాషణ వింటుంటే శంకర్రావుకు ఎక్కడ్లేని కోపం, చిరాకు కల్గింది. "ఎవరింటి విషయం వాళ్ళు ఏడవక తనపై తన భార్యపై విసుర్లు వేయటం వీళ్ళకేమి సరదానో. అయినా వాళ్ళకీ అవకాశం యిచ్చినందుకు శాంతననాలి. వాళ్ళనని ప్రయోజనం లేదు" లోలోనే అనుకొన్నాడు శంకర్రావు. తనింక అక్కడ ఓ క్షణం కూడా ఉండలేకపోయాడు.

"ఓ గంట పోయినాక రావచ్చులే. అప్పటికి శాంతకు నిద్రమత్తుకూడా కాస్త తీరుతుంది. విషయమేమిటో కూడా తెలుస్తుంది. ఎటూ రేపు శలవే గదా. యిప్పుడు వీళ్ళముందు హడావుడిచేసి చులకనయి పోవటం దేనికి" అనుకొంటూ స్కూటర్ స్టార్టుచేసి రోడ్డు పైకి వెళ్ళాడు.

శంకర్రావు అలావెళ్ళగానే ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ షేక్‌హ్యాండు యిచ్చుకుంటూ "ఈ రాత్రికి శంకర్రావు చేతిలో శాంతకు మంచి సత్కారం లభిస్తుందిలే" అని మనస్సులో సంతోషపడ్తూ ఎవరి దారిన వాళ్ళు పోయారు.

శంకర్రావు తిరిగి యింటికొచ్చేసరికి రాత్రి పదకొండున్నరయింది. ఈసారి శాంత బయట అరుగుపైనే ఒక్కర్తే కూర్చుని తనకోసమే ఎదురు చూస్తున్నది. భర్తను చూడగానే ప్రాణం లేచివచ్చినట్లయింది శాంతకు. "తనిందాకా మొద్దు నిద్రపోయినప్పుడు ఆయన వచ్చి వెళ్ళారేమో, యిక రాత్రంతా ఏ స్నేహితుడి రూములోనో పడుకొని ప్రొద్దునే వస్తారేమో" అని మధన పడ్తోంది శాంత అంతవరకూ.

శాంత చూపుల్లోనే ఆవిడ తనరాక కోసం ఎంత నిరీక్షిస్తుందో సులువుగా గ్రహించాడు శంకర్రావు. యిందాకటి కోపం, చిరాకు యిప్పుడు శంకర్రావులో లేవు. శంకర్రావు లోపలికి రాగానే తలుపేసి "సారీ" చెప్పింది శాంత.

"ఈ చిన్నవిషయానికి మనమధ్య "సారీ"లాంటి పెద్దపెద్ద మాటలెందుకులే గానీ, యిందాక నువ్వు నిద్రపోతున్నపుడు ఎదురింటి కాంతం, ఆవిడ స్నేహితురాళ్ళు నిన్ను, నన్ను ఎన్నిమాటలన్నారో తెల్సా. నాకసలు కోపం ఆగలేదు. ఎట్లానో నన్ను నేను తమాయించుకొని మళ్ళీ రోడ్డుపై కెళ్ళాను" అంటూ జరిగిందంతా వివరంగా చెప్పాడు శంకర్రావు శాంతకు.

"అలాగా" అంటూ మధ్యాహ్నం తనకు సరోజకు జరిగిన సంభాషణ గురించి సంక్షిప్తంగా చెప్పి "ఓసారి యిటురండి" అని తనవెంట తీసుకెళ్ళి తలుపుతీసి "కాంతం యింటివైపు ఓసారి చూడండి" అంది తను ప్రక్కకు తప్పుకొంటూ.

ఎదురుగా కన్పడ్తున్న దృశ్యంచూసి శంకర్రావు అవాక్కయిపోయాడు. కాంతం భర్త బయట మెట్ల ప్రక్కన అరుగుపై టవల్ పర్చుకొని నిద్ర పోతున్నాడు ఆ చల్లో వణుకుతూ.

కాంతం భర్త పొద్దుపోయి యింటికి వచ్చి తలుపు తడ్తే ఆవిడ ఎంతకీ తలుపు తీయకపోవటంతో చివరకు ఆయన ప్రాణం విసిగి అక్కడే టవల్ పర్చుకొని నిద్రపోవటం, తను చూసినదంతా వివరంగా చెప్పింది శాంత. బయట చలికి వణుకుతూ ఆయనలా ముడుచుకొని పడుకోవటం శంకర్రావుకు ఎంతో జాలేసింది. తన భార్య శాంతవైపు చూశాడు ఏమిచేద్దామన్నట్లుగా?

"మనింటికి పిల్చుకురండి. ఈ రాత్రికి మీరిద్దరూ బెడ్‌రూములో పడుకోండి. నేను డ్రాయింగ్ రూములో పడుకొంటాను" చెప్పింది శాంత భర్త అభిప్రాయం గ్రహించి.

శాంత చెప్పిందే తడవుగా శంకర్రావు వెళ్ళి ఆయన్ని లేపి తీసుకొచ్చి తనింట్లో పడుకోబెట్టుకొన్నాడు.

మర్నాడుదయం తన భర్త శంకర్రావుగారింట్లో కాఫీ త్రాగుతుండటం చూసిన కాంతంకు గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లయింది. ముందు "ఈ విషయం తన స్నేహితులకు తెలిస్తే ఎలా సమాధానం చెప్పకోవాలా?" అన్నది కాంతం ప్రధాన సమస్య అయి కూర్చుంది. పశ్చాత్తాపం మాట దేముడికే తెలియాలి. *

**సినిమాహాలు—బస్సు**

బుజ్జిగాడు:"అమ్మా! సినిమాకెళ్ళి... డేమో" వేలెడు లేవు. నీకెంత చోటు కావాలి. నాబళ్ళో కూచో అంటావు. అదే బస్సులో 5 ఏళ్ళ వెధవ్వి. విడిగా జరిగి కూచోలేవా అని కసుర్తావ్. ఎందుకే?"

**ఎవరికి ఉంది?**

తండ్రి:నీకేమన్నా బుద్ధి వుందిరా గోపీ?
గోపి:"అమ్మ నీకు బుద్ధి లేదంటుంది.నువ్వు అమ్మకు లేదన్నావు. నాకు లేదంటున్నావు. ఎవరికి మాత్రం ఉందేమిటి?

జె.శ్యామల

